క్లుప్తంగా

పేదలకు వస్త్రాల పంపిణీ



పేదలకు దుప్పట్లు, వస్త్రాలు అందజేస్తున్న హెల్పింగ్ హేండ్స్ నిర్వాహకులు

పాలకొండ రూరల్: అవసరమైన వారికి సాయం చేయడంలో ఎంతో ఆనందం ఉంటుందని హెల్పింగ్ హేండ్స్ నిర్వాహకులు వి.రాజశేఖర్ అన్నారు. పట్టణ, మండల పరిధిలో నిరాశ్రయులు, పేదలను గుర్తించి మంగళవారం దుప్పట్లు, దుస్తులను తమ సంస్థ సభ్యులతో కలసి అందించారు. సమాజ సేవలో యువత తమ వంతు ముందడుగు వేయటంతో పాటు తమ సహచరులను ప్రోత్సహించాలని కోరారు. కార్యక్రమంలో సభ్యులు శివరామకృష్ణ, లోలుగు రామచంద్ర, టి.అనిల్, ఎం.సత్యంనాయుడు, ఎస్.జనార్ధన, కె.రాజశేఖర్, ఎ.శేఖర్, జి.రాము తదితరులు పాల్గొన్నారు.

విలువలతో కూడిన విద్యనందించాలి



మాట్లాడుతున్న డిప్యూటీ ఈఓ కృష్ణమూర్తి

పాలకొండ రూరల్: తరగతి గదిలో విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను అందించాలని పాలకొండ డిప్యూటీ ఈఓ పి.కృష్ణమూర్తి అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల వేదికగా మంగళవారం పాఠశాలల యాజమాన్య కమిటీ అధ్యక్షులకు, ప్రధానోపాధ్యాయులకు మండల స్థాయి శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ క్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ల అధికారాలు, విధులు, పాఠశాల అభివృద్ధిలో వారి పాత్రపై అవగాహన కల్పించారు. ఉపాధ్యాయులు బడి బయట పిల్లలు లేకుండా చూడాలని, నిర్బంధ విద్యతో పాటు వారికి కల్పించబడిన చట్టాల గూర్చి వివరించారు. శిక్షణలో ఎంఈఓ కుటి సోంబాబు, మీసాల సూర్యనారాయణ, రిసోర్స్‌పర్సన్లు పి.హుమనికుమార్, ఎస్.వాసుదేవరావు, ఎస్.గణేష్, నానిబాబు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయండి

భామిని: ఉత్తర భారతదేశంలో ఉత్తమ మండలంగా భామిని ఎంపిక కావడానికి మండల అధికారులు చేసిన కృషే కారణమని ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి యశ్వంత్‌కుమార్ రెడ్డి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో నీతి ఆయోగ్‌లో ఉత్తమ ఏస్పిరేషన్ బ్లాక్‌గా భామిని గుర్తింపు పొందడానికి చేపట్టిన ఆరు అంశాల ప్రగతికి చేసిన కృషిని వారు అభినందించారు. దీనిపై వివిధ శాఖల పనితీరును సమీక్షించారు. దీనికి ప్రతిగా నీతి అయోగ్ ఆధ్వర్యంలో భామిని మండలం ఉత్తమంగా నిలిచినందుకు రూ.1.50కోట్లు మంజూరు చేసినట్టు వివరించారు. ఈ నిధుల వినియోగానికి నీతి అయోగ్ కమిటీ పర్యటనలో గుర్తించిన మరిన్ని సౌకర్యాల కల్పనకు తగిన ప్రతిపాదనలు కోరినట్టు వివరించారు. అవసరమైతే ఇదే నిధులతో పాటు ఐటీడీఏ ఆధ్వర్యంలో అదనపు నిధులు మంజూరు చేయిస్తామని ఎమ్మెల్యే జయకృష్ణ వివరించారు. దీనికి మండల అధికారుల నుంచి తగిన ప్రతిపాదనలు తీసుకోవాలన్నారు. బత్తిలి, భామిని, బాలేరు వైద్యాధికారుల పనితీరును మెచ్చుకుంటూ రానున్న రోజుల్లో రక్తహీనత నివారణకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఐటీడీఏ ఏపీఓ జి.చిన్నబాబు, డీడీ అన్నదొర, ఎంపీడీఓ చంద్రరావు, తహసీల్దార్ అప్పారావు, ఇతర మండల అధికారులు పాల్గొన్నారు.



మండల అధికారులను అభినందిస్తున్న ఎమ్మెల్యే, పీఓ

పార్టీలో కార్యకర్తలకు సముచిత స్థానం

- మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి



వైఎస్సార్‌సీపీ నాయకులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కళావతి

వీరఘట్టం: పార్టీ కోసం జెండా పట్టుకుని కష్టపడిన ప్రతీ కార్యకర్తకు వైఎస్సార్‌సీపీ సముచిత స్థానం కల్పిస్తుందని మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. ఇటీవల వివాహం జరిగిన కిల్లారి శ్రీనివాసరావు కుమార్తె, అల్లుడులను ఆశీర్వదించడానికి మంగళవారం వీరఘట్టంలోని వారి స్వగృహానికి వచ్చిన ఆమె పార్టీ నాయకులతో కొద్ది సేపు మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చేపట్టబోయే కార్యక్రమాల్లో అందరూ భాగస్వాములు కావాలని కోరారు. ఇటీవల కరెంటు బిల్లులు పెంపునకు నిరసనగా చేపట్టిన పోరుబాట కార్యక్రమాన్ని విజయవంతం చేసిన అందరికీ ధన్యవాదాలు తెలిపారు. వీరఘట్టం పట్టణంతో పాటు మండలంలోని వైఎస్సార్‌సీపీ బలోపేతానికి చేపట్టాల్సిన చర్యలపై నాయకులతో చర్చించారు. ఆమెతో పాటు పార్టీ నాయకులు బూరాడ చిన్న, పిన్నింటి శ్రీను, భోగి మణి, శంభాన శ్రీను, పిన్నింటి దుర్గారావు, బండి రాజు, అంబళ్ల రవి, కందల వెంకటనాయుడు తదితరులున్నారు.

పలు గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు



డెప్పివలస గ్రామంలో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సు

వీరఘట్టం: మండలంలోని డెప్పివలస గ్రామంలో మంగళవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు 6 వినతులు వచ్చినట్లు తహసీల్దార్ సత్యనారాయణ తెలిపారు. భూ రికార్డుల్లో హెక్టార్లుగా ఉండడంతో భూముల కొనుగోళ్లు, విక్రయాలకు రిజిస్ట్రేషన్లు కావడం లేదని కొందరు ఫిర్యాదు చేసారు. వీటిని ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరిస్తామని తహసీల్దార్ సూచించారు. కార్యక్రమంలో సర్వే డీటీ ప్రసాదరావు, ఆర్.ఐ లక్ష్మనాయుడు, గ్రామ పెద్దలు, రైతులు పాల్గొన్నారు.



భామిని: సదస్సులో మాట్లాడుతున్న రెవెన్యూ అధికారులు

భామిని: మండలంలోని చిన్నదిమిలిలో డిప్యూటీ తహసీల్దార్ శంకరరాయుడు ఆధ్వర్యంలో మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. భూ సమస్యలపై పలు వినతులు అధికారులు స్వీకరించారు. ఎండోమెంట్ ఆర్ఐ జె.దుర్గారావు ఆధ్వర్యంలో ఆలయ భూములపై వినతులు స్వీకరించారు. ఆర్ఐ కృష్ణారావు, వీఆర్ఓ శంకరరావు, రైతులు పాల్గొన్నారు.

అక్రమ సస్పెన్షన్లపై నిరసన



ఆర్టీసీ యాజమాన్యం సర్క్యులర్ నంబరు 1/2019ని పక్కనపెట్టి అక్రమ సస్పెన్షన్లు చేస్తున్నారని ఈయూ జోనల్ కార్యదర్శి భాసూరు కృష్ణమూర్తి ఆరోపించారు. యాజమాన్యాల తీరును నిరసిస్తూ మంగళవారం భోజన విరామ సమయంలో తమ నిరసన తెలిపారు. ఈ క్రమంలో ఈ తరహా చర్యలను ఖండిస్తూ పాలకొండ డిపో ఎదుట నినాదాలు చేశారు. అనంతరం గేట్ సమావేశం నిర్వహించారు. ఉద్యోగుల ఇబ్బందులపై మాట్లాడారు. జనవరి 3, 4 తేదీల్లో అన్ని డిపోల వద్ద రిలే దీక్షలు చేపడతామన్నారు. అవసరమైతే 10వ తేదీ నుంచి సామూహిక సెలవులు పెడతామని తెలిపారు. ఈయూ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ డి.దుర్గారావు, ఎంవీ సాగర్, వెంకటరమణ, ఎల్.దామోదరం, లక్ష్మణరావు, విజయబాబు, రాజు పాల్గొన్నారు. – పాలకొండ రూరల్

సరైన ప్రణాళికలతోనే సివిల్స్‌లో విజయం



సరైన ప్రణాళికలతో చదివితే సివిల్స్‌లో విజయం సాధించవచ్చని ఐటీడీఏ పీఓ యశ్వంత్‌కుమార్ రెడ్డి అన్నారు. కర్త ఫౌండేషన్ ఆధ్వర్యంలో దేశంలో వివిధ రాష్ట్రాల్లో చదువుతున్న విద్యార్థులతో ఆయన ముఖాముఖి మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ఉన్నత లక్ష్యాల సాధనకు ఎలా ప్రయత్నించాలి, ఎన్ని గంటలు చదవాలనే అంశాలు వివరించారు. ఏపీఓ చిన్నబాబు, ట్రైబల్ వెల్ఫేర్ డీడీ అన్నదొర, ఆర్ట్స్ డైరెక్టర్ నూక సన్యాసిరావు, కోఆర్డినేటర్ బి.శంకరరావు పాల్గొన్నారు.

అధ్వానంగా వండువ - నవగాం సీఎస్పీ రహదారి

వీరఘట్టం: వీరఘట్టం నుంచి పాలకొండ వరకు ఉన్న సీఎస్పీ రహదారిలో వండువ – నవగాం మధ్య ఉన్న మూడు కిలోమీటర్ల రహదారి అధ్వానంగా మారింది. పెద్ద పెద్ద గోతులు ఏర్పడడంతో వాహనదారులకు ప్రయాణం నరకయాతనగా మారింది. రోడ్డు పరిస్థితి దయనీయంగా ఉండడంతో తరచూ ఈ రోడ్డుపై ప్రమాదాలు జరుగుతున్నాయి. చాలా మంది క్షతగాత్రులవుతున్నారు. గత నెల 8న జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు ప్రాణాలు కోల్పోయాడు. తాజాగా మంగళవారం ఓ స్కూటీ అదుపు తప్పడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. ఇలా ప్రతీ రోజు ఈ గుంతల్లో పడి వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఎంతో ప్రాధాన్యత ఉన్న ఇక్కడ మరమ్మతులు చేపట్టకుండా మిగిలిన చోట్ల ఆర్అండ్‌బీ అధికారులు మరమ్మతులు చేపట్టారు. ప్రస్తుతం వర్షం నీరు ఈ గుంతల్లో చేరడంతో ప్రయాణం చాలా ప్రమాదకరంగా ఉంది. అధికారులు స్పందించి వెంటనే మరమ్మతులు చేపట్టాలని ఈ ప్రాంత ప్రజలతో పాటు వాహనచోదకులు కోరుతున్నారు.



అధ్వానంగా ఉన్న వండువ - నవగాం రహదారి

శ్రీ విజయ ఆస్పత్రిలో ఆరోగ్యశ్రీ శస్త్రచికిత్సలు

పాలకొండ రూరల్: ఎన్నడూ లేని విధంగా పెద్ద పెద్ద శస్త్ర చికిత్సలు పాలకొండలో ఆరోగ్యశ్రీ ద్వారా జరగడం మంచి పరిణామంగా శ్రీవిజయ ఆస్పత్రి నిర్వాహకులు దూబ పద్మావతి అన్నారు. పాలకొండ శ్రీవిజయ ఆస్పత్రిలో ఇటీవల పెద్ద బుడ్డిడి గ్రామానికి చెందిన కర్రి సీతమ్మకు వెన్నుపూస ఆపరేషన్ విజయవంతగా నిర్వహించినట్లు తెలిపారు. మంగళవారం ఆపరేషన్ చేయించుకున్న బాధితురాలితో కలసి వైద్యులు మీడియా సమావేశం నిర్వహించారు. సీతమ్మ వెన్నులో పూసలు క్రమం తప్పడంతో ఆమె పూర్తిగా నడవలేక మంచానికి పరిమితం అయినట్లు ఆర్థోపెడీషియన్ హితీష్ అక్షయరాజు అన్నారు. ఈ క్రమంలో నలుగురు వైద్యుల బృందం తమ ఆస్పత్రిలో దాదాపుగా 6 గంటలు ఆపరేషన్ విజయవంతంగా పూర్తి చేసినట్లు వివరించారు. ప్రస్తుతం బాధితురాలు స్వతహాగా నడవగలుగుతున్నట్లు తెలిపారు. గతంలో మాదిరి ఆపరేషన్లు, ఇతర వైద్యపరమైన సమస్యలకు ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేదన్నారు. హెల్త్ కార్డులు కూడా పరిగణనలోకి తీసుకుంటున్నట్లు తెలిపారు. సమావేశంలో వైద్యులు శరత్‌చంద్ర, సంపత్‌కుమార్, అనుపమ, మేనేజర్ ధర్మారావు పాల్గొన్నారు.



బాధితురాలితో కలసి మీడియా సమావేశంలో మాట్లాడుతున్న వైద్యులు

క్రికెట్ లీగ్ మెగా టోర్నమెంట్ పోస్టర్ ఆవిష్కరణ

పాలకొండ: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ఈ నెల 5 నుంచి మెగా క్రికెట్ టోర్నమెంట్ నిర్వహణ కోసం ఏర్పాట్లు చేపట్టారు. ఈ మేరకు మంగళవారం ఇందుకు సంబంధించిన పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నగర పంచాయతీ చైర్మన్ పల్లా ప్రతాప్ మాట్లాడుతూ పాలకొండ పట్టణంలో మెగా క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించడం ఆనందదాయకమన్నారు. టోర్నమెంట్ నిర్వాహకులు నూతలపాటి భరత్ భూషణ్ మాట్లాడుతూ పీసీఎల్ పేరుతో ఈ టోర్నమెంట్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో వెలమల మన్మధరావు, ఆకుల కుమార్, బాసూరు కాంతారావు, గణేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్లు ఆవిష్కరణ

పంటల బీమా నమోదు చేసుకోవాలి

జియ్యమ్మవలస: రైతులంతా తమ పంటలకు సంబంధించి, ఈ–క్రాప్, పంటల బీమా నమోదు తప్పనిసరిగా చేసుకోవాలని ఏడీఈ నిర్మలాజ్యోతి సూచించారు. మండలంలోని అల్లువాడ గ్రామ రైతు సేవా కేంద్రంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె పంటల సాగులో పాటించాల్సిన మెలకువలను రైతులకు వివరించారు. ధాన్యం విక్రయిస్తున్న రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. పంటల బీమా చేయించుకోవడం ద్వారా ప్రకృతి విపత్తుల కారణంగా పంట నష్టపోతే నష్టపరిహారం పొందవచ్చున్నారు. కార్యక్రమలో సర్పంచ్ బొంగు పరిశినాయుడు, ఏఓ జ్యోత్స్న తదితరులు పాల్గొన్నారు.



రైతులకు సూచనలిస్తున్న ఏడీఈ నిర్మలాజ్యోతి

కొత్త ఏడాదిలో సంతోషంగా ఉండాలి

- మాజీ ఎమ్మెల్యే కళావతి

వీరఘట్టం: నూతన సంవత్సరంలో ప్రజలంతా సుఖ సంతోషాలతో జీవించాలని మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి ఆకాంక్షించారు. మంగళవారం తన స్వగ్రామం వండవలో ఆమె మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. దూర ప్రాంతాల నుంచి స్వగ్రామాలకు వచ్చే వారు సుఖ ప్రయాణాలు చేసి గమ్యస్థానాలకు చేరుకోవాలని సూచించారు. ప్రశాంత వాతావరణంలో న్యూ ఇయర్ వేడుకలు జరుపుకోవాలని కోరారు.



శుభాకాంక్షలు చెబుతున్న మాజీ ఎమ్మెల్యే కళావతి

మాజీ ఎమ్మెల్యే కళావతి పరామర్శ

సీతంపేట: మండలంలోని లంగడుగూడ గ్రామానికి చెందిన సవర బిలియం ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో పాలకొండ మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి మంగళవారం ఆమె కుటుంబాన్ని పరామర్శించారు. వారికి ధైర్యం చెప్పారు. ఆమె వెంట సర్పంచ్ రాజయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు రంగారావు, వెంకి, నాగరాజు, అబ్బాస్, తిరుపతి తదితరులు ఉన్నారు.



పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే కళావతి

లైసెన్స్, ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు ప్రైవేట్ పరం చేయవద్దు

బలిజిపేట: కూటమి ప్రభుత్వ విధానాల ఫలితంగా ఆటో, మోటార్ రంగ కార్మికులకు తీవ్ర నష్టం వాటిల్లుతోందని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మన్మథరావు, ఆటోవర్కర్స్ యూనియన్ నాయకుడు మహేష్‌లు విమర్శించారు. ఈ మేరకు ఆటో కార్మికుల పట్ల ప్రభుత్వం తీరుపై బలిజిపేటలో మంగళవారం వారు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లైసెన్సులు, ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు ప్రైవేట్ వ్యక్తులకు అప్పచెప్పడం వల్ల తమపై మరింత భారం పడే అవకాశాలున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మోటార్ వెహికల్ చట్ట సవరణలు చేసి ఆటో, మోటార్ కార్మికుల జీవనోపాధిని దెబ్బతీస్తున్నారన్నారు. అధికారంలోకి వస్తే సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తాం. ఆటో కొనుగోలుకు సబ్సిడీతో రూ.4లక్షలు ఇస్తాం. వాహనమిత్ర పథకం ద్వారా సంవత్సరానికి రూ.15వేలు అందిస్తాం. జీవో నంబర్ 21రద్దు చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన తరువాత కూటమి ప్రభుత్వం వాగ్దానాలు అమలుచేయకుండా లేనిపోని విధానాలు అమలుపరిచి భారం మోపడం సమంజసంగా లేదన్నారు. కార్యక్రమంలో ఆటోవర్కర్స్ పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న ఆటోవర్కర్స్

న్యాయవాదులపై కక్ష సాధింపులు తగవు

పాలకొండ రూరల్: ప్రజలకు న్యాయం అందించేందుకు కృషిచేస్తున్న న్యాయవాదులపై కొంతమంది పోలీసులు కక్ష సాధింపులకు పాల్పడడం తగదని పాలకొండ న్యాయవాదుల బార్ అసోషియేషన్ అధ్యక్షుడు వై.సత్యనారాయణ అన్నారు. ఇటీవల రాష్ట్రంలో పలు చోట్ల ఈ తరహా ఘటనలు చోటుచేసుకోవడాన్ని ప్రస్తావించారు. తాజాగా అనంతపూర్ కోర్టులో విధులు నిర్వహిస్తున్న సీనియర్ అడ్వకేట్ బి.వి. శేషాద్రి విషయంలో అక్కడి పోలీసుల తీరు సహేతుకం కాదన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): సైబర్ నేరాలు ఎక్కువగా జరుగుతున్నందున ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని కురుపాం ఎస్ఐ పి.నారాయణరావు సూచించారు. సంకల్పం కార్యక్రమంలో భాగంగా మండలంలోని గుమ్మ గ్రామంలో సైబర్ నేరాలు–వాటి బారినపడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మంగళవారం అవగాహన కల్పించారు. స్మార్ట్‌ఫోన్లకు వచ్చే అనవసరమైన ఫోన్‌కాల్స్, మెసేజ్‌లకు స్పందించవద్దన్నారు. ఆన్‌లైన్ గేమ్స్ ఆడుతుండగా వచ్చే యాడ్ లింకులపై క్లిక్ చేయవద్దన్నారు. అలాగే ఫోన్‌లకు వచ్చే ఓటీపీ(వన్‌టైమ్ పాస్‌వర్డ్) ఎవరికీ చెప్పొద్దన్నారు.



సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ నారాయణరావు

రక్తహీనత నివారణపై అవగాహన

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని రేగిడి గ్రామంలో రక్తహీనత నివారణపై కళాజాత ప్రదర్శన ద్వారా మంగళవారం అవగాహన కల్పించారు. పీహెచ్‌సీ వైద్యాధికారులు వై.శంకర్, ఎం.ప్రదీప్‌కుమార్ మాట్లాడుతూ సికిల్ సెల్ ఎనీమియా అనేది ఒక జన్యుపరమైన వ్యాధి అని, రక్తంలో హిమోగ్లోబిన్ ఉత్పత్తి చేసే జన్యువులు లోపభూయిష్టంగా ఉంటాయని, సాధారణ రక్తకణాల కన్నా సికిల్ సెల్స్(కణాలు) మందంగా ఉన్నప్పుడు శరీరంలోని అవయవాలకు రక్తం సరఫరా సక్రమంగా జరగదని, ఆ సమయంలో తీవ్ర అనారోగ్యానికి గురికావాల్సి వస్తుందన్నారు.



అవగాహన కల్పిస్తున్న కళాజాత ప్రదర్శన కళాకారులు

చదువుతోనే భవిత

సీతంపేట: చదువుతోనే ఉజ్వల భవిత సొంతమవుతుందని, పదో తరగతిలో శత శాతం ఫలితాలు సాధించాలని ఐటీడీఏ డిప్యూటీ ఈఓ కె.రవిప్రసన్నకుమార్ విద్యార్థినులకు సూచించారు. సీతంపేట గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ ఉన్నతపాఠశాలను ఆయన మంగళవారం సందర్శించారు.